18వ
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం,16 డిసెంబర్ 2024


# భారీ ర్యాలీగా కుడా ఛైర్మన్ ఊరేగింపు



**– దారి పొడవున కూటమి నాయకులు హారతులు, గజమాలలతో స్వాగతం**

**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షులు, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆదివారం తన అనుచరగణంతో భారీ ఊరేగింపుగా పులిమేరు గ్రామం నుండి కాకినాడ కుడా ఆఫీసుకు వెళ్ళి ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం ఉదయం పెద్దాపురం మండలం, పులిమేరు గ్రామంలో కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) గ్రామంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలినడకన గ్రామ పొలిమేరల వరకు భారీ ర్యాలీగా వచ్చి, ప్రచార రథం ఎక్కారు. ఊరేగింపుగా ప్రచార రథంపై బయలుదేరారు. మార్గమాధ్యలో గోరింట గ్రామంలో జనసేన, టిడిపి నాయకులు భారీ స్థాయిలో స్వాగతం పలికి ఆహ్వానించి, గోరింటలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి కుడా ఛైర్మన్‌చే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ సాగి వడ్లమూరు మీదుగా జి.రాగంపేట, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుకుంది. ఈ ర్యాలికి పెద్దాపురం నియోజకవర్గం నుండే కాకుండా ఉభయ గోదావరి జిల్లాల జనసేన, కూటమి నాయకులు, బాబు అభిమానులు భారీ స్థాయిలో ర్యాలీలో పాల్గొన్నారు. పెద్దాపురం ఎస్సై వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# ఘనంగా కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి పదవీ బాధ్యత స్వీకరణ మహోత్సవం









**– ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, వివిధ నియోజకవర్గాల శాసనసభ్యులు**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** కాకినాడ అర్బన్ డవలప్మెంట్ అథారిటీ (కుడా)చైర్పర్సన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి పదవి బాధ్యత స్వీకరణ మహోత్సవం ఆదివారం కాకినాడ ఆర్టీవో ఆఫీస్, ఎన్ఎఫ్సిఎల్ రోడ్డు నందు కుడా కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, ఎం ఎల్సీ యనమల రామకృష్ణుడు,కాకినాడ ఎంపీ తంగెళ్ళఉదయ్ శ్రీనివాస్, కాకినాడ పట్టణం, కాకినాడ రూరల్,జగ్గంపేట, ప్రత్తిపాడు, అనపర్తి శాసనసభ్యులు వనమాడి కొండబాబు,పంతం నానాజీ, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపల్లి అజయ్, రాష్ట్ర పౌరసరఫరాల చైర్మన్ తోట సుధీర్, ఇతర కూటమి ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరై తుమ్మల రామస్వామికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. అనంతరం కాకినాడ అర్బన్ డవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా తుమ్మల రామస్వామి బాధ్యతల స్వీకరిస్తూ రిజిష్టర్‌లో సంతకం చేశారు. కుడా వీసీ, కాకినాడ కమిషనర్ భావన చైర్మన్ రామస్వామితో ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కాకినాడ అర్బన్ డవలప్మెంట్ అథారిటీ చైర్పర్సన్‌గా కుడా పరిధిలోని ప్రాంతం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందన్నారు. తనపై నమ్మకముంచి కుడా ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్,ఇతరప్రజాప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. 350 గ్రామాల పరిధిలో విస్తరించిన కాకినాడ అర్బన్ డవలప్మెంట్ అథారిటికి సంబంధించి పూర్తి పారదర్శకతతో, అవినీతి రహితంగా సేవలందించడం జరుగుతుం దని ఈ సందర్భంగా తుమ్మల రాస్వామి తెలియజేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోట్టి శ్రీరాములు వర్ధంతి




**చింతూరు, మేజర్ న్యూస్ :** స్థానిక చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పోట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం చరిత్ర విభాగంలో తెలుగు అధ్యాపకరాలు కె.శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కె.రత్న మాణిక్యం ఆధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోట్టి శ్రీరాములు వంటి మహానీయుని ప్రాణ త్యాగం వల్ల ఆంధ్ర రాష్ట్రం భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిందని, ఆ మహనీయుడు త్యాగం మరువలేనిదని శ్లాఘించారు. ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ మధ్య గల వ్యత్యాసంను చక్కగా వివరించారు. తెలుగు అధ్యాపకరాలు కె.శ్రీదేవి మాట్లాడుతూ పోట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ సమాజంలో ఇటువంటి మహనీయులు కీర్తి ప్రశంసనీయమైనదని తెలియపరిచారు. చరిత్ర అధ్యాపకుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవ పరిరక్షణకు కృషిచేసిన మహనీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.సి.హెస్.నాగేశ్వరావు, జి.హారతి, కె.లక్ష్మి,కె.శకుంతల, జి.సాయికుమార్,యన్.రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని మెట్లు మహోత్సవం





**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల నడుమ అత్యంత వైభవంగా మెట్ల మహెరీత్సవం నిర్వహించారు. ఉదయం 7గంటలకు ఆలయ ప్రధాన అర్చకుడు, అర్చకులు, శ్రీస్వామి, అమ్మవార్లను వివిధ రకల సుగంధ భరితమైన పుష్పాలతో అలంకరించి పల్లకిలో ఆసీనులు గావించి వేదపండితుల మంత్రోచ్చారణ,మంగళ వాయిద్యాలు నడుమ, భక్తుల నామస్మరణ మధ్య కొండపై నుంచి కొండ దిగువకు తోడుకొని వచ్చి గ్రామ పురవీధుల్లో ఘనంగా గ్రామ సేవ నిర్వహించారు. తదుపరి తొలి పావంచాల వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు కొబ్బరికాయ కొట్టి మెట్లు పూజా కార్యక్రమం ప్రారంభించారు. మహిళలు, భక్తులు, మెట్టు మెట్టుకు పసుపు కుంకుమ రాస్తూ హారతి వెలిగించి సత్యదేవుని నామస్మరణ చేస్తూ పల్లకి సేవలో స్వామి సన్నిధికి చేరుకొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం అధికారులు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కాకుండా తగు ఏర్పాట్ల చేశారు. ఈ మెట్లు పూజా కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీడీవో కార్యాలయంలో మహా నేతల వర్ధంతి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయంలో మహానేతల వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు బంధం శ్రీదేవి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, సర్ధార్ వల్లభాయ్ పటేల్ ఇరువురు మహా నేతల వర్ధంతి పురస్కరించుకొని వారి చిత్ర పటాలకు మండల పరిషత్ అధ్యక్షురాలు బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యులు పండా వెంకటలక్ష్మి, యంపిటిసి సభ్యులు, కోఅప్షన్ సభ్యులు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానేతలు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు, ఉద్యమ పోరాటాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుండం శ్రీనివాసు దొర, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పి.జయంతి, ఇఓపిఆర్‌డి పద్మజ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవం



**అన్నవరం,మేజర్‌న్యూస్:**కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ప్రతి ఆదివారం స్వామివారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులు రథోత్సవ సేవలో పాల్గొనేందుకు టికెట్లు తీసుకుని శ్రీ స్వామివారి రథోత్సవ సేవ పాల్గొన్న భక్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రథోత్సవ సేవలో వేద పండితులు, ఆలయ అర్చకులు, దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, సూపరింటెంట్ ఐ.వి.రామారావు, పిఆర్ఓ కొండలరావు, దేవస్థానం సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు

**– వర్ధంతి సభలో మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి, తన ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అమరుడై మహాపురుషుడుగా చరిత్రలో నిలిచి పోయారని రాష్ట్ర కార్మికశాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్ అన్నారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా రామచంద్రపురంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంత్రి సుభాష్ ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన శ్రీరాములు మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొసం కృషిచేసిన మహనీయుడుగా అభివర్ణించారు. అయన వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు కడు పేదరికంలో జన్మించారని, ఆయన దండి సత్యాగ్రహ సమయంలో గాంధీజీ ప్రభావంతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొని పలుమార్లు జైలుకెళ్లిన దేశ భక్తుడు అని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూనే ఖాదీ ప్రచారం, హిందూ–ముస్లిం ఐక్యత, రెల్లి కార్మికుల సమస్యలు, మద్యపాన నిర్మూలన, జైళ్ల సంస్కరణలు, విద్యార్థుల సమస్యల కోసం నిరంతరం శ్రమించారన్నారు. నేడు తెలుగు రాష్ట్రంతో పాటు భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు మూలకారకుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఆ మహనీయుని పోరాటపటిమ, ఆదర్శ భావాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగిపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ మూలపురుషుడు పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ చిరస్మరణీయుడు అని నగర పాలక సంస్థ కమిషనర్ భావన కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీబీఎం స్కూల్ రోడ్డు, ఫెలోషిప్ చర్చ్ సెంటర్లోని ఆయన విగ్రహానికి ఆత్మార్పణ దినం పాటిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ భావన పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పట్టుదల, కృషి, త్యాగాల ఫలితంగానే తెలుగు ప్రజలు ఆత్మగౌరవంతో పురోగమించేందుకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు.

# ప్రతీ రక్తదాత... మరొకరికి ప్రాణదాత - తొగరు మూర్తి



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** స్థానిక రాజా రత్న కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ నెంబర్ తొగరుమూర్తి ఆధ్వర్యంలో రాజరత్నం బ్లడ్ సెంటర్ మరియు హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు ఉద్యోగుల సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజారత్న ఫార్మా మెడికల్ స్టూడెంట్స్,ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థులు 55 మంది రక్తదానం చేసినారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ తొగరు మూర్తి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతీరోజూ ఆపద సమయంలో రక్తం దొరకక 12,000 మంది చనిపోతున్నారు, సంవత్సరంలో దాదాపు 20 లక్షల మంది చనిపోతున్నారు. 135 కోట్లు జనాభా ఉన్న భారతదేశంలో ఇంతలా చనిపోవడానికి కారణం బ్లడ్ డొనేట్ చేయడానికి చేయడానికి ఎవరు ముందుకు రాకపోవడమే కారణం. యువకులారా మీ హీరో ఒక సినిమా యాక్టర్ కావచ్చు లేదా మీ ఫాదర్ మదర్ టీచర్ లేదా మీ ఫ్రెండ్ మీరు వేరొకరికి హీరో కావాలంటే ఒక్కసారి రక్తదానం చేయండి మీరు మీరు మూడు కుటుంబాలకు నిజమైన దేవుడు హీరో అవుతారు. నేను 91సార్లు రక్తదానం చేశాను. విద్యార్థిని విద్యార్థులారా మానవతావాదులారా ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని తొగరు మూర్తి పిలుపునిచ్చారు. ఒక్కసారి రక్తదానం చేస్తే అది ముగ్గురు ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం చేయడానికి 18 నుండి 60 సంవత్సరములు వయసుగల ఆరోగ్యవంతమైన వారు సరిపోతారని తెలిపారు. రక్తదానం చేస్తే మన బాడీలో ఎక్కువగా ఉన్న ఐరన్ మొత్తం పోతుంది. మన శరీర బరువు నియంత్రణలో ఉండి క్యాన్సర్, గుండె పోట్లు వంటి అనేక వ్యాధులు వచ్చే అవకాశం చాలా తక్కువ అని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, కాకినాడ శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రాజారత్నం ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్ కె. రామారావు, ఏ.వో రవీందర్, హెచ్‌డిఎఫ్ బ్యాంక్ మేనేజర్ జి.శ్రీనివాస్, విజయ్ కుమార్, అనిల్ కుమార్, ఉలిశెట్టీ బాబి, సూర్య ప్రకాష్, గునిశెట్టి రోహిణి కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ 15వ వార్షికోత్సవం

**– వృద్ధులకు పేదలకు అప్పట్లో చీరలు పంపిణీ**






**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** శ్రీ సత్యసాయి ట్రస్ట్ విశాఖపట్నం వారి 15వ వార్షికోత్సవం సందర్భంగా ద్రాక్షారామలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ విశాఖపట్నంకు చెందిన శివకోటి మధు సూధనరావు ఆధ్వర్యంలో ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరస్వామి అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 700 మంది వృద్దులకు, వికలాంగులకు, మహిళలకు సుమారు 3లక్షలు విలువైన చీరలు, దుప్పట్లు, మరియు వారందరికీ భోజనం, బాబావారి ప్రసాదం అందజేసినారు. అనంతరం మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం డిసెంబర్ నెలలో తమ బృందం 50మంది సభ్యులుతో కలిసి విశాఖపట్నం నుండి ద్రాక్షారామ వచ్చి బాబా ఆశీస్సులతో పేదవారికి మేము సేవ చేస్తున్నామని తెలిపారు. మా సంస్థ వారు విశాఖపట్నంలో కే.జీ.హెచ్. వద్ద ప్రతీరోజూ 500 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నేటికి 15 సంవత్సరాలు నుండి నిరంతరంగా మా బృందం ద్రాక్షారామ వచ్చి పేదవారికి ఉచితంగా బట్టలు, భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాట్ల అప్పారావు, దాడి భాస్కర్, పి. శ్రీనివాస్, జె. చంద్రశేఖర్, ఐ.రవికిరణ్, బి.శ్రీకాంత్, ఎస్వీఆర్ రాజు, వై.నాగేశ్వరరావు, ఎం.కామేశ్వరరావు, వై.రోజారాణి, ఎం.పద్మావతి, వై.విజయ తదితరులు పాల్గొన్నారు.

# 'ఐటీడీఏ'లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం అనేక ఉద్యమాలు చేసి ఆంధ్ర రాష్ట్రం సాధించిన స్వర్గీయ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఘనంగా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్థానిక ఐటిడిఏ కార్యాలయం సమావేశం హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలంతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి సింహాచలం మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16వ తేదీన నెల్లూరు జిల్లా పడమటిపల్లి గ్రామంలో జన్మించడం జరిగిందన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి కర్నూల్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుగా ప్రకటించడం జరిగిందని,అదేవిధంగా 1952 డిసెంబర్ 15వ తేదీన అమరజీవి పొట్టి శ్రీరాములు మరణించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములును ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. తెలుగు ప్రజలు ఆంధ్రులకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని అప్పటి ప్రధాన మంత్రిని ఆంధ్ర రాష్ట్రం కోసం డిమాండ్ చేయడం జరిగిందన్నారు. పొట్టి శ్రీరాములుకు ఆంధ్ర జాతిపిత అనే బిరుదు ఇవ్వబడిందని తెలిపారు. అదేవిధంగా ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములుతోపాటు అనేకమంది ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములుకు మద్దతుగా నిలబడడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో గిరిజనసంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, పిహెచ్ఓ చిట్టిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, నాగరాజు, సీనియర్ అసిస్టెంట్లు బి.రాజు, శ్రీకాంత్, పి.భీమిరెడ్డి, దయానంద్, విల్సన్, గ్యాస్ మేనేజర్ చిన్నబ్బాయి, బి.మార్గదర్శి, కె.పండు దొర, సిహెచ్.సోమిరెడ్డి, పి.లక్ష్మిరెడ్డి, తాతారావు, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## భారత సాహిత్య అవార్డు గ్రహీత సుర్ల



**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** భారతీయ సాహిత్య అకాడమీ నేషనల్ అవార్డు గ్రహీత రౌతులపూడి గ్రామానికి చెందిన సుర్ల శ్రీనివాస్ కు దక్కింది. జిల్లా,మండల స్థాయిలో అనేకమంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ ఏర్పాటు కేంద్రాలు, ఉచిత న్యాయ సలహాలు,అగ్ని బాధితులకు, ఆర్థికగా నష్టపోయిన పేదలకు అనేక రంగాలలో నష్టపోయిన ప్రజలకు తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు సుర్ల శ్రీనివాస్. ఢిల్లీలో భారతీయ దళిత సాహిత్య అకాడమీ నిర్వహించిన సభలో సుర్ల శ్రీనివాసు సోషల్ సర్వీస్ కార్యక్రమాలు చేస్తున్నందుకుగాను జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్పీ సుమనాక్షర్ చేతుల మీదుగా నేషనల్ అవార్డు అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి నేపాల్ గవర్నర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుండ్లూరు ధన శేఖర్ రెడ్డి రమణమ్మ, కొత్తపల్లి అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

## శునకాల సంతతిని నియంత్రించే చర్యలు వేగంగా చేపట్టాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** శునకాల సంతతిని నియంత్రించే చర్యలు వేగంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. ఆదివారం స్థానిక జగన్నాథపురం ఏటిమొగలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను కమిషనర్ భావన పరిశీలించారు. అక్కడ డ్యామేజ్ అయిన కెన్నల్స్‌ను తనిఖీ చేసి వాటికి వెంటనే రిపేర్లు చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అలాగే ఆపరేషన్ థియేటర్, వాటిలోని సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో ఏబీసీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి శస్త్రచికిత్సలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# లేజర్ వైద్యం సురక్షితం - డాక్టర్ రాయుడు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రస్తుత కాలంలో లేజర్ చికిత్స చేసుకునే విధానం బాగా ప్రాచుర్యం పొందిందని అయితే ఈ వైద్యం పట్ల ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీలాస్య హాస్పిటల్ అధినేత ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ త్రిమూర్తులు రాయుడు అన్నారు. స్థానిక గాంధీనగర్‌లో ఉన్న శ్రీలాస్య హాస్పిటల్ ప్రాంగణంలో లేజర్ చికిత్స విధానం వాటి ఉపయోగాలు అనే అంశంపై ఆదివారం యువతి యువకులలో అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ త్రిమూర్తులు రాయుడు నిర్వహించారు. డాక్టర్ రాయుడు మాట్లాడుతూ లేజర్ వైద్య రంగంలో అధునాతన పరికరాలు రావడం శుభ పరిణామమని దీని ద్వారా అనుభవజ్ఞులైన వైద్యుల చేత లేజర్ చికిత్స చేయించుకున్న వారి అనారోగ్య సమస్యలు తప్పక పరిష్కారం అవుతాయన్నారు. చికిత్స విధానం సురక్షితమని డాక్టర్ రాయుడు స్పష్టం చేశారు.

వైద్య సేవలు పొందే సమయంలో లేజర్ చికిత్స చేస్తున్న వారి అనుభవంతో పాటు వినియోగించే లేజర్ పరికరాల తాలూకు వివరాలను కూడా తప్పనిసరిగా వైద్యులను అడిగి తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉత్పన్నము కావని డా.రాయుడు అన్నారు. జంక్ ఫుడ్ తినడం ద్వారా చర్మంతో పాటు అనేక శారీరక సమస్యలు వస్తాయని సాధ్యమైనంత వరకు వాటిని స్వీకరించకుండా ఉండడం శ్రేయస్కరం అన్నా.ఆహారం స్వీకరించే టప్పుడు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, అదేవిధంగా క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, విటమిన్ 'సి'కలిగిన పదార్థాలను స్వీకరించాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని,





అనుభవజ్ఞులైన వైద్యుల నుండే లేజర్ చికిత్స చేయించుకోవాలని ఇలా పలు సూచనలను డాక్టర్ రాయుడు చేసారు. గత 17 సంవత్సరాలుగా ఈ వైద్య రంగంలో సేవలు అందిస్తూ రోగులకు ఉపశమనం కలిగిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ లేజర్ చికిత్స విధానం ద్వారా టాటూస్ తొలగించవచ్చని, బొల్లి మచ్చల సమస్యను పరిష్కరించవచ్చని, అవాంచిత రోమాలకు ప్రత్యేక చికిత్స ద్వారా సమస్య పరిష్కరించ వచ్చని, పులిపిరి కాయలను, ముఖం పై వుండే డింపిల్స్ ను కూడా తొలగించవచ్చని అన్నారు. పోస్ట్ కోవిడ్ ద్వారా ప్రజలలో అనేక అపోహలు ఆందోళనలు కలగడం వల్ల కొత్త అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని వారందరికీ ఈ నూతన వైద్య విధానం ద్వారా కాపాడవచ్చు అన్నారు. రాత్రి బాగా పొద్దు పోయాక బిరియాని మరియు శీతల పానీయం స్వీకరించడం ఎంతో ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. లేజర్ వైద్య చికిత్స విధానంలో ఇటీవల కొత్త పోకడలు తాము గమనించామని, ప్యాకేజీల ద్వారా చికిత్స చేసే విధానం ఉందంటూ కొంతమంది ప్రజలను ప్రభావితం చేస్తున్నారని, అటువంటి వారిని నమ్మవద్దని ఆయన సూచించారు.

ఏ అర్హత లేని వాళ్ళు లేజర్ వైద్య చికిత్స నిర్వహించడం తదనంతరం పరిణామాలు ఎదురవడంతోనే క్వాలిఫైడ్ వైద్యులను సంప్రదిస్తున్నారని ఉదాహరణలతో డాక్టర్ రాయుడు ప్రస్తావించారు. వైద్యుల అర్హతను తప్పనిసరిగా ప్రశ్నించవచ్చని, వారి వినియోగించే వైద్య పరికరాలు యొక్క నాణ్యత మరియు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించవచ్చని, ఇలా చేయడం ద్వారా రోగులు సురక్షితమైన వైద్య సేవలు పొందేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

ఈ అవగాహన సదస్సులో జేఎన్టీయూకే విద్యార్థులతో పాటు పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పేరెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ రాయుడు నిర్వహించిన అనేక లేజర్ చికిత్సల తాలూకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన విధానం అందరిని ఆకట్టుకుంది. డాక్టర్ రాయుడుని విద్యార్థిని విద్యార్థులు లేజర్ వైద్యంపై ఉన్న అనేక అనుమానాలను ప్రశ్నల పూర్వకంగా అడిగి తెలుసుకోవడం ముఖ్య ఉద్దేశం నెరవేరిందని శ్రీలాస్య హాస్పిటల్ గైనకాలజిస్ట్ ప్రముఖ మహిళా వైద్యురాలు డాక్టర్ ఎం.రాధిక అన్నారు.

## సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

**– కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ కార్యక్రమం డిసెంబర్ 16వ తేదీ సోమవారం యధా విధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్, మండల కేంద్రంలో ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

## పొట్టి శ్రీరాములు త్యాగనిరతి మరువరానిది

**– జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డా.కె.వెంకటేశ్వరావు**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** తెలుగు భాష మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం సాధించారని, అయన పట్టుదల, త్యాగనిరతి మరువరానిదని ప్రతిఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డా.కె.వెంకటేశ్వరావు అన్నారు.శ్రీ పొట్టి శ్రీరాములు 72 వ వర్ధంతి సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి కార్యాలయం నందు డా.కె. వెంకటేశ్వ రావు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారు 56 రోజులు నిరాహార దీక్ష తో ప్రత్యేక తెలుగు భాష రాష్ట్రం సాధించారని, అయన పట్టుదల, త్యాగనిరతి మరువరానిదని ప్రతిఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరిండెంట్స్ సత్యనారాయణ, స్టాలిన్,మరియు డా మౌనిక, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములకు నివాళులర్పించిన జేసీ రాహుల్ మీనా



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్వతంత్ర సమరయోధుడు, ఆంధ్ర ప్రదేశ్ అవతరణ మూలపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మాట్లాడే ప్రజలందరి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటులో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్ రావు, వివిధ విభాగాల అధిపతులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేఎఫ్‌సిఎల్ చెక్ పోస్ట్ వద్ద బియ్యం తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ పోర్టు నుంచి పిడిఎస్ బియ్యం అక్రమ ఎగుమతులను నిరోధించే చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ 2వ గేట్ వద్ద ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను ఆదివారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా.. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్, పోర్ట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన కేఎఫ్‌సిఎల్ పోర్టులో ఉన్న ఉషశ్రీ ట్రేడర్స్‌కు చెందిన స్టఫ్ రైస్ కంటైనర్ల నుండి చెక్‌పోస్ట్ టీమ్‌తో నమూనాలు సేకరించి పరీక్షలు చేయించారు. ఈ నమూనాల పరీక్షలలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ లేనందున కంటైనర్లలోని బియ్యం పీడీఎస్ బియ్యం కావని నిర్ధారించారు.

ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజల భద్రత నిమిత్తం ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అక్రమ ఎగమతులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు పటిష్టంగా నిర్వహించేందుకు ఇటీవల నూతనంగా మరోక చెక్ పోస్టును కేఎఫ్సీఎల్ వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చెక్‌పోస్ట్‌ల వద్ద సుశిక్షుతులైన సిబ్బంది తనిఖీలు నిర్వహించిన అనంతరం వాహనాలకు గేట్ పాస్ ద్వారా అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు మూడు షిఫ్టులలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలకు చెందిన అధికారులతో కూడిన బృందం తనిఖీలు నిర్వహించి నమూనాలు సహకరించడం జరుగుతుందన్నారు. అనుమానిత నమూనాలను విశ్లేషణ నిమిత్తం పౌరసరఫరాల శాఖ జిల్లా ల్యాబ్ కు పంపించడం జరుగుతుందని జేసీ రాహుల్ మీనా తెలిపారు. ఈ పరిశీలనలో జేసీ వెంట కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఇన్చార్జి పౌరసరఫరాల అధికారి అధికారిణి ప్రసన్న లక్ష్మీదేవి, పోర్టు అధికారులు, పౌర సరఫరాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**– పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ,ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసా దులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ

**- ఆర్డీఓ శ్రీరమణి**



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** సోమ వారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదే శాల మేరకు నిర్వహణ జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా తెలిపారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు చిరస్మరణీయం..

## ఆయన ఆశయాలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతాం

**– రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాన్ని తృణ ప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసేందుకు ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించి జరపడం హర్షణీయం. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో అగ్ర స్థానంలో నిలుపుతాం.. నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాసిన మహనీయులు పొట్టి శ్రీరాములు త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాన్ని తృణ ప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం, స్ఫూర్తిని భావితరాలకు తెలియజేసేందుకు ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించి జరపడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములును త్యాగాలను మననం చేసుకున్న మంత్రి దుర్గేష్ ఘన నివాళి అర్పించారు.. డిసెంబర్ 15వ తేదీని ఆయన గౌరవార్థం ఆత్మార్పణ దినంగా నిర్వహించడం వల్ల ఆయన కృషి, త్యాగం భవిష్యత్ తరాలకు తెలియడమేగాక స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రం కోసం, దేశం కోసం, ప్రత్యేకించి తెలుగు జాతి కోసం ఆలోచించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని మంత్రి వివరించారు.. అంతేగాక భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడయ్యారన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము,అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడిగా పొట్టి శ్రీరాములు కీర్తిగాంచారని గుర్తు చేశారు..ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో అగ్ర స్థానంలో నిలుపుతామని, నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు.

## నియోజకవర్గం స్థాయిలో పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నియోజకవర్గం స్థాయిలో పిఠాపురంలో ఈ నెల 16, సోమవారం ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన జిల్లా దిగువ స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు ఉదయం 9.30 నిమిషాలకు పిఠాపురం రథాలుపేట అంబేద్కర్ కమ్యునిటి హాలులో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అదేవిధంగా జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం10:00 గంటల నుంచి 01:00 గంట వరకు యదావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

## తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కొరకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు

**–వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.డి.శ్రీనివాస్**



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు అర్పించిన మహనీయుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.డి.శ్రీనివాస్ అన్నారు.

ఆదివారం స్థానిక ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న వ్యవసాయ కళాశాల, రాజమహేంద్రవరంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా జరుపుకుని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా. డి. శ్రీనివాస్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు. గాంధేయవాది అయిన శ్రీ పొట్టి శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు అర్పించిన మహనీయుడు అని, ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి ఏడాది ఆయన వర్ధంతి ని ఆత్మార్పణ దినంగా జరుపుకుని స్మరించుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థులకి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకి బహుమతులు అందజేశారు. ఆయన చిత్ర పటానికి ప్రొఫెసర్లు, ఆఫీస్ సిబ్బంది మరియు విద్యార్థులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డా.ప్రవీణ, డా.శేఖర్, డా.శ్రీనివాస్, డా.సంతోష్, డా.చిన్ని, ఆఫీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వాసవి జాతీయ సీనియర్ ఉపాధ్యక్షునిగా వెంకట నగేష్



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 2025 సంవత్సరానికి గాను వాసవియన్ సీనియర్ సిల్వర్ స్టార్ పిఠాపురం పట్టణవాసి,న్యాయవాది (కెసిజిఎఫ్) వెలగా వెంకట నగేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడు రాష్ట్రం మదురైలో తుంకుమ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ హాల్ నందు వాసవియన్ డైమండ్ స్టార్ కేసీజిఎఫ్ అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. వాసవి అంతర్జాతీయ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ వెలగా వెంకట నగేష్‌తో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం నగేష్‌ను రెండు తెలుగు రాష్ట్రాల ఆర్యవైశ్య ప్రముఖులు, పిఠాపురం నియోజకవర్గ ఆర్యవైశ్య కుటుంబసభ్యులు ఆయన్ని అభినందించారు.

## నగరపాలక సంస్థ అధికారులతో పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సమావేశం





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఏపీ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కె.కన్నబాబు శనివారం రాత్రి కాకినాడ నగర పాలక సంస్థకు విచ్చేశారు. ముందుగా ఆయనకు కమిషనర్ భావన, అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, నగరపాలక కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, టీపీఆర్వో శైలజ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం ఏపీ పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కె.కన్నబాబు నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ నగరపాలక సంస్థ రెవెన్యూ వసూళ్లు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు అంశాలను అధికారులు కన్నబాబు దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఇంజినీరింగ్ ఆరోగ్య విభాగాలపైనా ఆయన సమీక్షించారు.

## లయన్స్ క్లబ్ రీజనల్ కాన్ఫిరెన్స్‌ను విజయవంతం చేయాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 9వ తేదీన కాకినాడ సూర్యకళామందిరంలో స్నేహ పద్మం పేరిట నిర్వహించనున్న లయన్స్ క్లబ్ రీజనల్ కాన్ఫిరెన్స్‌ను విజయవంతం చేయాలని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్స్ డా. బాదం బాలకృష్ణ, ముంజులూరి విశ్వేశ్వరరావు పిలుపునిచ్చారు.

కాకినాడ రామారావుపేటలో గల లయన్స్ కమ్యూనిటి హాల్‌లో లయన్స్ రీజనల్ చైర్పర్సన్ పద్మతులసీ ఆధ్వర్యంలో స్నేహ పద్మం రీజనల్ కాన్ఫిరెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాస్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని రీజనల్ కాన్సిరెన్స్ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి 9వ తేదీన జరగనున్న స్నేహ పద్మం రీజనల్ కాన్ఫిరెన్సును విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డా.గరికిపర్తి నమఃశివాయ, రామసుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్‌లోని వివిధ క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీలు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న గోవులు కంటైనర్ పట్టివేత



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతాలకు అక్రమంగా గోవులను తరలిస్తున్న ఒక కంటైనర్ ను మారేడుమిల్లి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. చింతూరు నుండి 46 పశువులను కంటైనర్‌లో మారేడుమిల్లి మీదుగా చెన్నై తరలిస్తున్న ముఠాను మారేడుమిల్లి పోలీసులు పట్టుకున్నారు. మారేడుమిల్లిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గోవులుతో తరలిస్తున్న కంటైనర్ పోలీసులకు పట్టుబడింది. పశువులతో పట్టుబడిన వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి, ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన పశువులను గోశాలకు తరలించడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. ఈమేరకు మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం స్వర్గీయ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో ఆత్మార్పణ దినో త్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, మున్సిపల్ సిబ్బంది వీర్రాజు, గంగాధర్, సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ ప్రాతఃస్మరణీయుడు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టిశ్రీరాములు నిరుపమాన త్యాగ ఫలమే ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రంగా సిద్ధించిందని, ఆయన నిస్వార్థ ఆత్మార్పణకు తెలుగు ప్రజలందరూ సదా కృతజ్ఞతాబద్ధులై ఉండాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీబిఎం స్కూల్ రోడ్డు, ఫెలోషిప్ చర్చ్ సెంటర్‌లో గల ఆయన విగ్రహానికి వద్ద ఆత్మార్పణ దినం పాటిస్తూ జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనామాడి వెంకటేశ్వరరావు, కాకినాడ కమిషనర్ భావన, పలువురు జిల్లా అధికారులు, పుర ప్రముఖులు ఈకార్యక్రమానికి హాజరై అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు అలంకరించి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రఅవతరణ మూల పురుషుడు పొట్టిశ్రీరాములు తెలుగువారందరికీ ప్రాతఃస్మరణీయుడు, చిరస్మరణీయుడు అని కొనియాడారు.

ఆయన పట్టదల, కృషి, త్యాగాల ఫలితంగానే తెలుగు భాష మాట్లాడే ప్రజలు ఆత్మగౌరవంతో పురోగమించేందుకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి కోసం చేసిన నిరుపమాన, నిస్వార్థ త్యాగానికి కృతజ్ఞతగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా ప్రకటించి, ఏటా రాష్ట్రవ్యాప్తంగా శ్రద్ధాభక్తులతో పాటించడం జరుగుతోందన్నారు. ఆదర్శనీయమైన ఆయన అచంచల దీక్షా, పట్టుదలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోని, రాష్ట్రాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పిలుపునిచ్చారు. కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు ఆంధ్రుల హృదయాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. గుర్తింపు, గౌరవం లేకుండా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మద్రాసీలుగా పిలవబడుతన్న తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరుతూ 48 రోజులపాటు కఠోర నిరాహార దీక్షచేసి పొట్టి శ్రీరాములు అమరులయ్యారన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ మూల పురుషుడిగా కీర్తి గడించిన అమరజీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మార్పణ దినంగా పాటిస్తూ ఘనంగా నిర్వహించాలనే కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ పట్టణంలో ఆయన సేవలను సంస్మరిస్తూ ఘన నివాళులు అర్పిస్తున్నామని ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిఎం.లల్లి,బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, యువజన సర్వీసుల శాఖ సీఈవో కాశీ విశ్వేశ్వరరావు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, ఎంహెచ్వో డా.డి.పృథ్వీ చరణ్, పలువురు అధికారులు, పుర ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





## గండేపల్లి మండలంలోని పుష్కర కాలవ నీటి సంఘం అధ్యక్షులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వ కలయిక

– ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు అందర్నీ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలంలోని పుష్కర కాలవ నీటి సంఘం అధ్యక్షులు ఉప్పలపాడు అడబాల భాస్కరరావు, గండేపల్లి మాసిన సతీష్, యల్లమిల్లి పెనుమర్తి అర్జున్ రావు, మురారి నిమ్మలపూడి గోవింద రాజు, రాగం పేట కురుకూరి సత్యనారాయణ, సూరంపాలెం, అన్నా బత్తుల అంజిబాబు, పీ నాయికంపల్లి పాలకుర్తి లక్ష్మీపతిరావు, రావి పాటి పద్మరాజు, ముంద్రు శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారందరినీ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, పాలకుర్తి ఆదినారాయణ, పి వెంకటేశ్వరరావు, శిలామంతుల వీరబాబు, కొండ్రు అప్పలరాజు, కురుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** మండలంలోని గ్రామాల్లో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేదిరేశ్వరం హైస్కూల్లో పొట్టి శ్రీరాములు 72 వర్ధంతిని హెచ్ఎం కె.ఈశ్వర్‌రెడ్డి , చైర్మన్ మారే సుబ్బాయమ్మ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకు తెలుగు రాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములుదేనన్నారు. ముంబైలో సానిటరీ ఇంజనీరింగ్ చదివిన తర్వాత గ్రేట్ ఇండియన్ రైల్వేలో నాలుగు సంవత్సరాలు ఉద్యోగం చేసి 1928లో తన కుమారుడు చనిపోవడం, కొద్ది రోజులకే భార్య చనిపోవడం వల్ల ఉద్యోగానికి రాజీనామా చేసి జీవితం మీద విరక్తి చెంది ఉద్యమాల బాట పట్టారు. గాంధీని అనుసరిస్తూ 58 రోజులు ఆంధ్ర రాష్ట్రం కోసం అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమర వీరుడయ్యారన్నారు. మన దేశం కోసం ప్రాణాలర్పించిన వారి చరిత్ర గురించి పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయులు పిల్లలకు నేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి దుర్గేష్ ఆదేశాలతో పునః ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు



**పెరవలి, మేజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై స్పందించి పరిష్కారం చూపించిన మంత్రి కందుల దుర్గేష్.నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం ధాన్యం కొనుగోళ్ళు లో ( ప్యాడి ప్రక్రుమెంట్ సెంటర్స్)కు టార్గెట్ లు పూర్తి అయి 7 గ్రామాల లో ధాన్యం కొనుగోలు నిలిచి పోవడంతో, రైతులు వారి ఆవేదనను మంత్రివర్యులు దృష్టికి తీసుకురాగా,ఆయన వెంటనే స్పందించి, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలకుండా చూసే బాధ్యత నాది అని వారికి హామీ ఇచ్చి , రాష్ట్ర సివిల్ సప్లై డిపార్ట్మెంట్ వారితో ,మరియు జిల్లా కలెక్టర్ తో వెంటనే మాట్లాడి అదనముగా 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించినారు.

సమస్యను చెప్పిన వెంటనే స్పందించి పరిష్కార మార్గం చూపించిన మంత్రి గారికి రైతులు ధన్యవాదాలు తెలియజేశారు.

## రైలు నుండి జారిపడి మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

**ఏలూరు,మేజర్‌న్యూస్:**ఏలూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఆది వారం ఉదయం సుమారు 75 సం.ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు రైలు బండి నుంచి జారిపడ్డాడు. అతని తల మీద ,ఎడమ ముక్కి వద్ద, ఎడమ మోకాలు కింద లోతుగా రక్త గాయాలు అయ్యి స్పృహ కోల్పోయాడు. అతనిని 108 అంబు లెన్సు ద్వారా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఇఎన్‌టి వార్డ్ నందు వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు చొక్కా ,నీలం రంగు గళ్ళ లుంగీ కలిగి ఉన్నాడు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుని తాలూకా ఎవరూ లేని కారణముగా మృత దేహమును ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. రైల్వే ఎస్ఐ సైమన్ 9989219559 కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి జిల్లా స్థాయి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఘన నివాళి అర్పించడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో పొట్టి శ్రీరాములు 72 వ వర్ధంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని చేపట్టి ఘన నివాళి అర్పించడం జరిగిందని తెలిపారు. తెలుగు భాష మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేపట్టి, రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి అన్నారు. తదుపరి రోజుల్లో నెల్లూరు జిల్లా కు ఆయన పేరు పెట్టడం జరిగిందనీ తెలిపారు. లక్ష్య సాధనలో ప్రాణాలు అర్పించిన అటువంటి నాయకుల నుంచి స్ఫూర్తి పొందాలని జాయింట్ కలెక్టర్ రాముడు పిలుపు ఇచ్చారు. భారతదేశంలో తొలిసారిగా భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని పోరాడిన యోధుడు పొట్టి శ్రీరాములు వర్ధంతి ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందనీ, ఆమేరకు మనందరం కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు కు నివాళులు అర్పించి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపివో ఎల్ అప్పలకొండ, ఇంఛార్జి జిల్లా బిసి సంక్షేమ అధికారి కెఎన్ జ్యోతి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి రాధిక, కలక్టరేట్ ఏవో ఆలీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం సుధాకాలనీలో గల బిసి కాలేజ్ గర్ల్స్ హాస్టల్ నందు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా.ఎల్. అనూషరాయ్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి తెలుపుతూ వసతి గృహంలో ఉన్న విద్యార్థిణీలు సీజనల్ వారీగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆమె సూచించారు. రక్తంలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా సీతాకాలంలో మంచు, చలిగాలులు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి ఆహారం తీసుకోవాలని భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని, ఆమె సూచించారు. ముఖ్యంగా హాస్టల్ సిబ్బంది, వంటగదిని, వంటపాత్రలను వేడి నీటితో శుభ్రపరచాలని ఆమె తెలిపారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి విశాలాక్షి తెలుపుతూ సుమారు ఈ హాస్టల్ నందు 108 మంది విద్యార్థిణిలు ఇక్కడ ఉంటూ చదువుకుంటున్నారని, వీరికి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం మెను ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో చదువుకోవడానికి మంచి చక్కటి అవకాశం కల్పించడం జరుగుతుందని, నిరంతరం వైద్య సేవలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, హెచ్‌డబ్ల్యూఓ విశాలాక్షి తెలిపారు.

## కానూరు నీటి సంఘం అధ్యక్షులుగా జజ్జవరపు వెంకట సత్యనారాయణ



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు డిసెంబర్ 14వ తేదీ శనివారం ప్రశాంతంగా ముగిసాయి. కానూరు నీటి సంఘం అధ్యక్షులుగా జుజ్జవరపు వెంకట సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా అంగర గణేశ్వరరావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకలపూడి వీర్రాజు, ముళ్లపూడి రాజు, బూరుగుపల్లి రాజు, హనుమంతు సుబ్రమణ్యం, ఉప్పలపాటి సత్తిరాజు, సుంకవల్లి మధు, తదితరులు విజేతలను అభినందించారు.

# కినపర్తి పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– ఎఫ్ఎస్ఓ అర్జున్



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కినపర్తి గ్రామ శివారు చేను మకాలుప్రాంతంలో శనివారం సాయంత్రం పులి కనిపించిందని గ్రామానికి చెందిన తొంటా చిన్నబాబు గ్రామస్తులకు చెప్పడం జరిగింది. ఈ మేరకు సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు ఎఫ్ ఎస్ ఓ అర్జున్, సిబ్బంది శనివారం రాత్రి కినపర్తి గ్రామానికి వెళ్లి గ్రామస్తులను విచారించారు. చిన్న బాబు శనివారం సాయంత్రంఇంటి నుండి చేను మకాలకు వెళ్తుండగాస్వయంగా పులి ఎదుటపడిందని భయంతో పరుగులు తీశాను అన్నారు. అలానే పొలం నుండి ఇంటికి తన భార్యతో వెళ్తుండగా అదే ప్రాంతంలో పెద్ద పెద్ద సౌండ్లు వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులకు చిన్న బాబు తెలిపాడు. ఈ మేరకు ఫారెస్ట్ అధికారులు ఆదివారం గ్రామ పరిసర ప్రాంతాల్లో చెరువులు, కాలువలు వద్ద పులి పాదముద్రలు కోసం అన్వేషించారు.చిన్న బాబు పులిని చూసిన ప్రాంతానికి వెళ్లి ఫారెస్ట్ అధికారులుగాలించారు. ఎక్కడ పులి పాద ముద్రలు కాన రాలేదని ఎఫ్ ఎస్ ఓ అర్జున్ స్థానిక విలేకర్లకు తెలిపారు. కొన్ని రోజుల పాటుకినపర్తి పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంటరిగా పశువులను అడవులోకి తోలుకు వెళ్ళరాదని తెలియజేశామన్నారు.

## మాలల ఐక్యత చాటిన గుంటూరు మాలల సభ

– భారత మాల మహా సంగ్ ఫౌండేషన్ నాయకులు వెల్లడి

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** గుంటూరులో నిర్వహించిన మాలల ఐక్య సమ్మేళనం అద్భుత విజయం సాధించిందని భారత మాల మహాసంగ్ ఫౌండేషన్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులో నిర్వహించిన మాలల ఐక్య సమ్మేళనానికి రాష్ట్రవ్యాప్తంగా మాల ఐక్యత ఎంత ఉందో దేశానికి సాటి చెప్పడానికి తరలి వచ్చారని పౌండేషన్ నాయకులు పొడపాటి దుర్గారావు, కరిపోతు రాజకుమార్ మాల, దూసరి లోకేష్, పైడిమాల కృష్ణ, తలారి సతీష్ ,మానుకొండ మాధవ్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మాలల ఐక్యత కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మండలం నుంచి వేలాదిగా సొంత వాహనాలలో చలో గుంటూరు సభకు తరలి వెళ్లారు. గుంటూరు మాలల ఐక్యవేదిక సభ విజయవంతం అయిందని వారి పేర్కొన్నారు. వీరితోపాటు వాసా బత్తుల గంగాధర్, చేబత్తిన అరుణ్ కుమార్, దారా మనోజ్, అర్జ సాగర్, గుడెల్లి రవి, కుమ్మరపల్లి ప్రకాష్, కుమ్మరపల్లి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల జిల్లా పర్యటన

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబుతో కలిసి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించనున్నసందర్భంగా ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం రాత్రి 9 గంటలకు ఏలూరులోని రెవెన్యూ అతిథి గృహానికి చేరుకొని రాత్రి బస చేస్తారు.

సోమవారం ఉదయం 8గంటలకు ఏలూరు నుంచి బయలుదేరి 10గంటలకు పోలవరం చేరుకుని, ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలన అనంతరం సిఎం చంద్రబాబుతో కలిసి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు.

# తూర్పు గోదావరి జిల్లాలో ఎస్టీ కమిషన్ సభ్యులు వదిత్య శంకర్ నాయక్ పర్యటన



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు వదిత్య శంకర్ నాయక్ తూర్పు గోదావరి జిల్లాలో మూడు రోజుల అధికార పర్యటన నిమిత్తం రావడం జరుగుతోందనీ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె ఎన్ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. డిసెంబరు 15 రాత్రి 9 గంటలకి రాజమహేంద్రవరం చేరుకుని ఆర్ అండ్ బి అతిథి గృహంలో బస చేస్తారు. డిసెంబరు 16 సోమవారం ఉదయం 8 గంటలకి ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి బయలుదేరి ఉదయం 8.15 కు బొమ్మూరు లోని ఎ జి హెచ్ ఎస్ పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో 10 గంటల వరకు ముఖాముఖి సమావేశం అవుతారు. అక్కడ నుంచి ఉ.10 గంటలకు బయలుదేరి ఉ.10.15 కడియం మండలం వేమగిరి గ్రామానికి చేరుకుని షెడ్యూల్ తెగల ప్రజలతో మ.11.30 వరకు ముఖాముఖి సమావేశం అవుతారు. అనంతరం అక్కడ నుంచి ఉ.11.30 కు బయలుదేరి కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి మ.12 గంటలకు చేరుకుని మ.1 గంట వరకు షెడ్యూల్ తెగల ప్రజలతో ముఖాముఖి సమావేశం అవుతారు. భోజన విరామం అనంతరం మ.2 గంటలకు బయలుదేరి సా.4 గంటలకు ఆర్ అండ్ బి అతిథి గృహంకి చేరుకుంటారు. డిసెంబరు 17 ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఆర్ అండ్ బి అతిథి గృహంలో షెడ్యూల్ తెగల ప్రజల నుంచి, సంఘాల ప్రతినిధులు నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుంది. ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ తోనూ, మ.12 గంటలకు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 3 గంటలకి పత్రిక విలేఖరులు సమావేశంలో పాల్గొంటారు.

## భక్తి శ్రద్ధలతో లక్ష కుంకుమ అర్చన పూజలు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** చిన్న శబరిమలగా పేరుగావించిన అనపర్తి గ్రామంలోని అయ్యప్ప స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్నటువంటి దుర్గమ్మ అమ్మ వారికి మార్గశిర మాసం దత్త పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ పడాల సత్తిరెడ్డి రాజు గురుస్వామి ఆధ్వర్యంలో ప్రసిద్ధ పురోహితులు వరిస లేరు రాందేవ్ శర్మ పర్యవేక్షణలో సామూహిక కుంకుమ పూజలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ముందుగా రాజు గురుస్వామి పద్మావతి దంపతులుచే గణపతి పూజ ప్రారంభించి అనంతరం దుర్గమ్మ వారికి సామూహి కంగా లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. రాజు గురుస్వామి గారి ఆర్థిక సౌజన్యంతో వచ్చిన భక్తులకు పసుపు కుంకుమ అమ్మవారి ప్రతిమ మొదలగు పూజా సామాగ్రి పూజలో పాల్గొన్న భక్తులకు అందజేశారు ఈ పూజలో సుమారు 300 మంది ముత్తైదులు పాల్గొన్నారు. పూజ అనంతరం వచ్చిన భక్తులకు అల్పాహారం అందించారు. పూజా కార్యక్రమంలో పడాల వేణు, తుమ్మ సత్తిబాబు మండ నాగార్జున రెడ్డి పడాల శేఖర్ రెడ్డి పడాల శ్రీను తాడివాసు కృష్ణారెడ్డి పడాల దేవి మణికంఠ రెడ్డి భాస్కర్ రెడ్డి గురుస్వామి శ్రీ లక్ష్మీ దుర్గ స్టాప్ తదితరులు పాల్గొన్నారు.